Sakshi

01-21/12/16.

# సీఎం చూస్తున్నారు..

- శరవేగంగా మెట్రో పనులు
- సుల్తాన్‌బజార్ బాధితుల నుంచి అంగీకారం తీసుకోవాలి
- అధికారులతో సీఎస్ సమీక్ష



సమావేశంలో పాల్గొన్న సీఎస్ ప్రదీప్‌చంద్ర, ఉన్నతాధికారులు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలో మెట్రో పనులను శరవేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌చంద్ర ఎల్‌అండ్‌టీ, హెచ్ఎంఆర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మెట్రో పనుల పురోగతిని నిశితంగా పరిశీలిస్తున్నారని... పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తాయన్నారు. మంగళవారం మెట్రో పనులపై ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీలో ఆయన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మెట్రో పనుల కోసం యూసుఫ్‌గూడా,జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో మిగిలిన ఆస్తుల సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. సుల్తాన్ బజార్, బడీచౌడి, పుత్లీబౌలి ప్రాంతాల్లో ఆస్తులు కోల్పోయిన బాధితుల నుంచి అంగీకార పత్రాలను తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ముషీరాబాద్ జంక్షన్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో వక్ఫ్‌స్థలాలను హెచ్ఎంఆర్ఎల్ సంస్థకు అప్పగించాలని మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఈ ఆస్తులకు సంబంధించి ఇప్పటికే హెచ్ఎంఆర్ఎల్ సంస్థ పరిహారం చెల్లించిందని తెలిపారు.

**61 కి.మీ మార్గంలో వడివడిగా..**

ఈ సందర్భంగా మెట్రో పనుల పురోగతిని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి సీఎస్‌కు వివరించారు. ప్రస్తుతానికి 61 కి.మీ మార్గంలో మెట్రో మార్గానికి పునాదులు సిద్ధమయ్యాయని..58 కి.మీ మార్గంలో పిల్లర్ల ఏర్పాటు, 49కి.మీ మార్గంలో పిల్లర్లపై వయాడక్ట్ సెగ్మెంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం పనులను శరవేగంగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నవంబరు 2017 నాటికి ఎల్బీనగర్-మియాపూర్(కారిడార్-1), నాగోల్-రాయదుర్గం (కారిడార్-3) మార్గాల్లో మెట్రో పనులను పూర్తి చేస్తామని తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్‌నెం.5లోని ట్రాన్స్‌ట్రాయ్ బిల్డింగ్,సికింద్రాబాద్ ఇస్కాన్ దేవాలయం సమీపంలోని పద్మహంస అపార్ట్‌మెంట్స్, బేగంపేట్ పోస్టాఫీస్, అమీర్‌పేట్‌లోని రహమత్ కాంప్లెక్స్ ఆస్తుల సేకరణ ద్వారా దీర్ఘకాలిక సమస్యలను అధిగమించామన్నారు. ద.మ.రైల్వే సహకారంతో చిలకలగూడా రైలు ఓవర్‌బ్రిడ్జిని నిర్మాణం పూర్తి చేశామని..ఆలుగడ్డబావి, బేగంపేట్, ఒలిఫెంటా, లక్డీకాపూల్, మలక్‌పేట్ ప్రాంతాల్లో ఆర్ఓబీల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. సమావేశంలో జీహెచ్ఎంసీ కమీషనర్ బి.జనార్ధన్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఓమర్‌జలీల్ తదితరులు పాల్గొన్నారు.